క్లుప్తంగా

నేడు సత్యమ్మ కానుకల లెక్కింపు

నందిగామ: అంబారుపేట గ్రామంలోని శ్రీ సత్యమ్మ హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం బుధవారం జరుగుతుందని ఆలయ ఈవో సీతారామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి మంగళవారం అమరావతి మండలం నరకుల్లపాడు గ్రామానికి చెందిన ఉమ్మినేని ఉమామహేశ్వరరావు, చిలకమ్మ దంపతులు వారి కుమారుడు శ్రీనివాసరావు పేరు మీద రూ.20,100 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారిని అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

కొణతమాత్మకూరులో సిలువ మార్గం



నందిగామ: మండలంలోని కొణతమాత్మకూరు గ్రామంలో మంగళవారం సిలువ మార్గం నిర్వహించారు. గ్రామంలోని ఆర్‌సీఎం చర్చ్ ఆధ్వర్యంలో సిలువ మార్గం జరిగింది. ఫాదర్ ఫిలోమన్ రాజు ఆధ్వర్యాన ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఏసును స్తుతిస్తూ గ్రామంలో సిలువ మార్గం నిర్వహించారు. కార్యక్రమంలో పలు చర్చిల పాస్టర్లు, విశ్వాసులు, ఏసు మాలధారులు పాల్గొన్నారు.

కంపోస్ట్ తయారీపై అవగాహన



గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని కేవీకేలో సహజ వ్యవసాయంపై జరిగిన శిక్షణ తరగతుల్లో మంగళవారం కంపోస్టు ఎరువు, వానపాముల ఎరువు తయారీ విధానాలపై అవగాహన కలిగించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణంరాజు మాట్లాడుతూ కంపోస్టు ఎరువు ఎలా తయారు చేసుకోవాలి, కంపోస్టు విధానం, భూసార పరీక్షలను రైతులకు వివరించారు. కంది, పత్తి కట్టె ముక్కలు చేసే యంత్రాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లక్ష్మీకళ, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

264 మందికి వైద్య పరీక్షలు

వీరులపాడు: మండలంలోని తాటిగుమ్మి గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో మంగళవారం వైద్యారోగ్య శాఖాధికారులు ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. దీనిలో 264 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు వైద్యాధికారులు రుబెల్లా, నందిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి ప్రభుత్వం ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

నందిగామ: అనాసాగరంలో గ్రామ దేవతల ప్రతిష్ఠామహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామల్లోని ముత్యాలమ్మ అమ్మవారు, పోతురాజుల ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ఐదు రోజులపాటు జరగనున్నాయి. దీనిలో భాగంగా మొదటి రోజు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రతి ఒక్కరికీ నిత్యావసరాలు అందించాలి

వీరులపాడు: రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ డీలర్లు నిత్యావసర సరుకులు అందించాలని తహసీల్దార్ రాజకిషోర్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్‌లు ఎన్నికల నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. ముఖ్యంగా రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా నిత్యావసర సరుకులు అందించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీటీ సుమతి, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సమర్థులను ఎన్నుకుంటేనే అభివృద్ధి



నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు హారతిస్తున్న మహిళలు



నందిగామ ఐదోవార్డులో ఇంటింటి ప్రచారంలో జగన్‌మోహనరావు

- ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- అభివృద్ధి పథంలో నందిగామ

నందిగామ టౌన్: సమర్థులను ఎన్నుకుంటే నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజలకు మంచి జరుగుతుందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఐదో వార్డు పరిధిలోని శివాలయం, మెయిన్ రోడ్డు, వాసవీ మార్కెట్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు రానున్న ఎన్నికల్లో మద్దతు పలికి గెలిపించాలని కోరారు. ఆయనకు మహిళలు హారతిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ నందిగామను రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉంచాలనే సంకల్పంతో పని చేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 58 నెలల పాలన సాగించారన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో పూర్తి నిరాదరణకు గురైన బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచి వారి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని తెలిపారు.

అభివృద్ధికి చిరునామా.. నందిగామ

గత పాలకుల హయాంలో సమస్యల వలయంగా ఉన్న నందిగామ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఐదేళ్లలో అభివృద్ధికి చిరునామాగా మారిందని జగన్‌మోహనరావు తెలిపారు. నందిగామ అభివృద్ధికి అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచి కృషి చేస్తున్నామని చెప్పారు. రామలింగేశ్వర స్వామి వారి ఆలయం పూర్తి శిథిలావస్థకు చేరడంతో ఆలయ అభివృద్ధికి రూ. 1.30 కోట్ల నిధులు మంజూరు చేయించామన్నారు. గాంధీ సెంటరుకు పేరు తెచ్చేలా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న నట్ అండ్ బోల్ట్ గాంధీ విగ్రహంతో పాటు అతిపెద్ద మువ్వన్నెల పతాకాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మంచే చేశాను

శాసనసభ్యుడిగా నలుగురికి మంచి చేశాను తప్ప ఏ ఒక్కరికి చెడు చేయలేదని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. ముఖ్యంగా నందిగామ పట్టణంలోని వర్తక, వాణిజ్య వ్యాపారులకు అండగా నిలిచానన్నారు. పట్టణంలో ఏ కార్యక్రమం చేపట్టినా సొంత ఖర్చుతో నిర్వహించాను తప్ప గత పాలకుల మాదిరిగా పండుగలు, ఉత్సవాలకు చందాలు అడగలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నల్లమల్లి మురళి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, నాయకులు సూరె రామారావు, సముద్రాల మధు, పరిశ మల్లి, రాచూరి సీతారామ్, పాములపాటి రమేష్, ఓర్సు జ్వాల, పింగళి నరసింహారావు, విశ్వనాధపల్లి కృపారావు, కరి రవీంద్ర, వేమా సురేష్ బాబు, చింతా రవీంద్రనాధ్, నాదెండ్ల నరేంద్ర, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడానికి చర్యలు



కీసర మున్నేటి ఒడ్డున బోరు వేసేందుకు కొబ్బరికాయలు కొడుతున్న సర్పంచి రవికుమార్

కంచికచర్ల: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచి బొక్కా రవికుమార్ అన్నారు. మండలంలోని కీసర మున్నేటి ఒడ్డున గండేపల్లి గ్రామానికి తాగునీరు సరఫరాకు పంచాయతీ నిధులు రూ.1.10లక్షలతో కొత్త బోరుపంపు వేసేందుకు కొబ్బరికాయలు కొట్టి మంగళవారం అభివృద్ధి పనులు ప్రారంభించారు. సర్పంచి మాట్లాడుతూ మండలంలోని కీసర మున్నేటిలో నీటి నిల్వలు అడుగంటి పోవడంతో బోరు పంపులకు నీరు అందక విద్యుత్ మోటార్లు పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. మండలంలోని గండేపల్లి గ్రామానికి తాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. అయితే ఒక మోటార్ నుంచి గ్రామానికి రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా కావడానికి చర్యలు తీసుకున్నామన్నారు. దగ్ధమైన బోరు పంపును తొలగించటంతో పాటు మరో ప్రదేశంలో బోరు వేసేందుకు అధికారుల అనుమతులు తీసుకున్నామని తెలిపారు. గ్రామానికి పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా అయ్యేలా రెండు రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి బీవీ సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, నాయకులు రంగారావు, తలమాల కిషోర్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో చిన్న తిరునాళ్ల



సూచనలిస్తున్న డీసీపీ శ్రీనివాసరావు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్లలో భాగంగా ప్రధాన ఘట్టమైన అనిగండ్లపాడు గ్రామం నుంచి గురువారం వచ్చే పసుపు కుంకుమల బండ్లు కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని డీసీపీ కె. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన కార్యక్రమానికి సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నందిగామ ఏసీపీ రవికిరణ్, జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్ఐ రాంబాబుతో కలిసి సమీక్షించారు. తొలుత ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలించి ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజుకు పలు సూచనలు చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ పుట్టింటి పసుపు-కుంకుమల కార్యక్రమానికి భారీగా భక్తులు వస్తారని, విస్తృత బందోబస్తు నిర్వహిస్తామన్నారు.

సొంత గూటికి జాదవ్‌ఎల్లోజీ



వైఎస్సార్ సీపీలోకి ఎల్లోజీని ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు జాదవ్ ఎల్లోజీ కొన్ని అనివార్య కారణాలతో ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లారు. జరిగిన పొరపాటును గ్రహించి తిరిగి వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య, ఎమ్మెల్యే ఉదయభాను, పార్టీ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ సమక్షంలో చేరిన ఎల్లోజీకి ఉదయభాను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రతిపక్ష పార్టీలు తమ పార్టీలోని వారిని టీడీపీలోకి చేర్చుకునేందుకు అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తూ ఉంటారని, వారి మాటలు నమ్మి మోసపోకుండా నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్లోజీ మాట్లాడుతూ అనివార్య కారణాలతో తల్లిలాంటి వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో చేరానని, జరిగిన పొరపాటును గ్రహించి తిరిగి సొంత గూటికి వచ్చానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే ఉదయభాను గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు.

వైభవంగా వేణుగోపాలుని నగరోత్సవం



స్వామి వారి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి వారి కల్యాణోత్సవం సోమవారం అర్ధరాత్రి నేత్రపర్వంగా జరిగింది. కొత్తపేట వేణుగోపాలస్వామి చౌక్(నెహ్రూబొమ్మ సెంటర్)లోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న కల్యాణోత్సవాల్లో భాగంగా రెండు రోజులుగా స్వామి సన్నిధిలో పలు విశేష కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి అర్ధరాత్రి ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత కల్యాణవేదికపై సత్యభామ, రుక్మిణీ సమేత శ్రీ వేణుగోపాలుని ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం వివిధ ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించి మంగళ్యధారణ, తలంబ్రాలు సమర్పణ తదితర కార్యక్రమాలు కల్యాణోత్సవాన్ని ముగించారు.

వైభవంగా నగరోత్సవం

మంగళవారం స్వామి వారికి నగరోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి స్వామివారి కల్యాణం జరగగా మంగళవారం ఉభయదేవేరులతో కలిసి నగర వీధుల్లో విహరించారు. తొలుత రమణీయంగా అలంకరించిన వాహనంపై రుక్మిణి సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. అనంతరం స్వామి వారి నగరోత్సవాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించి పూజలు నిర్వహించారు. ఈ నగరోత్సవం ఆలయం నుంచి ప్రారంభమై బ్రాహ్మణవీధి, కేటీ రోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది.

30న ఉచిత నేత్ర వైద్య శిబిరం

మైలవరం: మైలవరం పోస్టాఫీస్ ప్రాంగణంలో ఈ నెల 30న ఆయాన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంతశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అధునాతన వైద్య పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, ఐ డ్రాప్స్ అందజేస్తారని చెప్పారు.

సీతారామాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక హోమాలు

కంచికచర్ల : స్థానిక శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం రాజ్యలక్ష్మీదేవి ఆలయంలో ఈనెల 28వ తేదీన విమాన శిఖర, రాజగోపుర ప్రతిష్ఠా మహోత్సవంజరుగుతుందని ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 7.30గంటలకు వేద పండితులు యాగశాలలో విష్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, పంచగవ్య ఆరాధన, పంచగవ్య ప్రాసన, వాస్తుపూజ, వాస్తు హోమం వాస్తు పర్యగ్నీకరణ, అక్షి వియోచన, అగ్ని మధన, ప్రధాన అగ్ని ప్రణయసం, నవకలశ స్నపన, పంచగవ్యాధి వాసం, అధివాసాంగ హోమం నీరాజనం వంటి పూజలు చేశారు. సాయంత్రం సామూహిక కంకుమార్చన, అగ్నిరాధన, చదుర్వింశతి కుంభారాధన, కంభాభిమర్శన, మహాశాంతి హోమాలు చేశారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు

వత్సవాయి: లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ అభిమన్యు హెచ్చరించారు. మంగళవారం లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలు జరిగినట్లయితే సదురు బైక్ రిజిస్ట్రేషన్ అయిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని చెప్పారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే జరిగే అనర్థాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. మొత్తం 40 మంది మైనర్లను గుర్తించి వారితో లైసెన్సు లేకుండా వాహనాలు నడపబోమని ప్రతిజ్ఞ చేయించారు.

ఫ్లెక్సీల తొలగింపు

కంచికచర్ల : త్వరలో రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు మంగళవారం తొలగిస్తున్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు కూడా ముసుగులు వేస్తున్నారు. విద్యుత్ పోల్స్, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా ఫ్లెక్సీలు తొలగిస్తున్నామని తహసీల్దార్ సుస్వాగతం అన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల్ కోడ్ నిబంధనలు పాటించాలని తహసీల్దార్ పేర్కొన్నారు.

మారెమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ. 5.48 లక్షలు

విస్సన్నపేట: పుత్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. 63 రోజులకు గాను రూ.5,48,837 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వై. సీతారామయ్య తెలిపారు. వేదాద్రి ఈఓ ఎస్. హేమలతాదేవి పర్యవేక్షణలో ఆలయ చైర్మన్ కోటగిరి సునీల్‌బాబు, ధర్మకరక్తల మండలి సభ్యులు, పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో హుండీ కానుకలను లెక్కించారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



కీసర టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కంచికచర్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కీసర టోల్‌ప్లాజా, పరిటాల పోలీస్ అవుట్ చెక్ పోస్టు వద్ద పోలీసులు మంగళవారం పలు వాహనాలను ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మద్యం, నగదు రవాణాకు అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. నగదు అక్రమ రవాణాకు చెక్ పెట్టేలా నేషనల్ హైవేపై హైద్రాబాద్ వైపు నుంచి విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు, గుంటూరు తదితర పట్టణాలకు వచ్చే పలు వాహనాలను క్షుణంగా తనిఖీలు చేశారు.

బూత్ కమిటీ సభ్యులు నిత్యం ప్రజల్లో ఉండాలి



మాట్లాడుతున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట: గ్రామాల్లో బూత్‌కమిటీ సభ్యులు నిత్యం ప్రజల్లో ఉండేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు, అనుమంచిపల్లి, రామచంద్రునిపేట గ్రామాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులతో మంగళవారం నియోజకవర్గ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి గడపకు నాయకులు, కార్యకర్తలు, బూత్‌కమిటీ సభ్యులు వెళ్లి చేసిన మంచిని వివరించాలని తెలిపారు. ముఖ్యంగా ప్రతిపక్ష టీడీపీ ఇచ్చే హామీలు ఏ మేరకు వస్తాయో ప్రజలకు తెలపాలని చెప్పారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్, గ్రామ కన్వీనర్‌లు బజారు సాయి, సుబ్బారావు, సత్యనారాయణ, కేడీసీసీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా, మాజీ ఎంపీపీ మాతంగి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన గోపీ ప్రకాశం టీడీపీని వీడి ఉదయభాను సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.

ముప్పాళ్లమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ముప్పాళ్లమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): ముప్పాళ్లమ్మ వారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో వేంచేసియున్న ముప్పాళ్లమ్మ వారి తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలుకగా అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నల్లాని సాయి, నల్లాని అయ్యన్న, బండారుపల్లి కపిల్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



ధనంబోడు కాలనీ నుంచి పార్టీలోకి చేరిన వారిని ఆహ్వానిస్తున్న సామినేని వెంకటకృష్ణ

జగ్గయ్యపేట అర్బన్: ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం పట్టణంలోని ధనంబోడు కాలనీకు చెందిన 18 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి పార్టీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలోకి చేరిన వారికి వెంకటకృష్ణ ప్రసాద్ కండువాలు కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో గుంజ వెంకటేష్, గుంజ పవన్, జితేంద్ర, నరసింహ, శివ, అంకమరావు, తాళ్లూరి పండుతో పాటు 11 కుటుంబాల వారు ఉన్నారు. వెంకటకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు పలువురు ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఉదయభాను అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ సుబ్బారావు, స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన దంపతులకు ఉదయభాను ఆశీస్సులు



కౌన్సిలర్ మనోహర్, మీనాక్షిలను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను, విమలాభాను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ వివాహ మహోత్సవానికి సంబంధించి రిసెప్షన్ మంగళవారం స్థానిక కోదాడ రోడ్డులోని బి కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. వివాహ మహోత్సవం ఈనెల 24 వ తేదీన అన్నవరం శ్రీసత్యనారాయణ దేవస్థానంలో జరిగింది. రిసెప్షన్‌కు రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, విమలాభాను దంపతులు హాజరై నూతన వధూవరులు వట్టెం మనోహర్, మీనాక్షిని ఆశీర్వదించారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆర్‌వోకు ఫిర్యాదు



పేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు అందజేస్తున్న ముత్యాల నవీన్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్‌పై మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అసిస్టెంట్ ముత్యాల నవీన్ మంగళవారం సాయంత్రం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. స్థానిక 14వ వార్డులో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి ఉంది. దానిని శుభ్రం చేయించాల్సిందిగా తాము శానిటరీ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని ఫిర్యాదులో తెలిపారు. దీంతో తాము ఎన్నికల విధుల్లో ఉన్నామని, ఎన్నికల పూర్తయ్యే వరకు ఈ విధులు తప్ప ఏపని చేయవద్దని ఎన్నికల కమిషనర్ ఆదేశించారని తమతో అన్నట్లు నవీన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగం కొండ ప్రాంతంలోని స్వయంభూ శ్రీ వల్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున స్వామివారి సుప్రభాత సేవ, అనంతరం గోపూజ, నవగ్రహ మండపారాధన జరిగాయి. ఉదయం 9 గంటలకు స్వామి, అమ్మవార్లకు మంగళస్నానాలు, నూతన వధూవరులుగా అలంకరించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ఉభయ దాతలు, భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అనంతరం స్వామివారి అన్నప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేయగా, స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తొత్తడి నాగరాజు దంపతులు పర్యవేక్షించగా, ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠంలో 9న అమ్మవారికి గాజులతో అలంకరణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): క్రోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా ఏప్రిల్ 9వ తేదీన బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారికి గాజులతో విశేషాలంకరణ జరుగుతుందని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తమ శక్తి కొద్ది గాజులను ఏప్రిల్ 3వ తేదీ లోగా దేవస్థానంలో అందజేయాలని కోరారు. సాయంత్రం 6.20 గంటలకు బ్రహ్మశ్రీ పుచ్చా సూర్యప్రకాశ్ శాస్త్రిచే ఉగాది పంచాంగ శ్రవణం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 9 నుంచి 17వ తేదీ వరకు వసంత నవరాత్రుల సందర్భంగా మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఉదయం 7.30 గంటలకు అభిషేకం, పుష్పార్చన నిర్వహిస్తామని తెలిపారు.